సాక్షి
నిజామాబాద్

బుధవారం, 10, సెప్టెంబర్, 2025



విపత్కర పరిస్థితుల్లోనూ..

శాంతి భద్రతల పరిరక్షణే కాకుండా విపత్కర పరిస్థితుల్లోనూ పోలీసులు నిరాటంకంగా విధులు నిర్వహిస్తున్నారు.

- 8లో ▸



క్షయ నిర్మూలనే ధ్యేయం..

దేశంలో క్షయను పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
38.0 /21.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చల్లనిగాలులు వీస్తాయి. మధ్యాహ్నం అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఘనంగా ప్రజాకవి కాళోజీ జయంతి



నిజామాబాద్‌అర్బన్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతిని అధికారికంగా నిర్వహించగా.. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాళోజీ సేవలను కొనియాడారు. అంతకుముందు వర్ని చౌరస్తాలో ఉన్న కాళోజీ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు నివాళులు అర్పించారు. అదనపు కలెక్టర్ అంకిత్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

సారగిరి అర్హులను గుర్తించాలి



నిజామాబాద్‌అర్బన్: పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు ఇందిర సౌర గిరి జల వికాసం పథకం ద్వారా సాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో అర్హులను గుర్తించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన గిరి జల వికాసం పథకం అమలుపై జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. పథకం అమలు కోసం చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలో పోడు భూములు సాగు చేసుకుంటున్న 5009 మందికి 10,172 ఎకరాలకు సంబంధించి ఆర్‌వోఎఫ్‌ఆర్ కింద పట్టాలు అందించినట్లు తెలిపారు. పంపిణీ చేసిన పోడు భూముల్లో సాగు నీటి వసతి కల్పించేందుకు సౌర గిరి జల వికాసం పథకం కింద దశల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అదనపు కలెక్టర్ అంకిత్, డీఎఫ్‌వో వికాస్ మీనా, బోధన్, ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీవో సాయాగౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 2021–2022 బ్యాచ్ ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సు (ఏపీఈ, పీసీహెచ్, ఐఎంబీఏ), ఎల్‌ఎల్‌బీ 1, 2, 3, 4, 5, 6వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షల ఫలితాల (సెప్టెంబర్ 2025) రీవాల్యుయేషన్ (పున:మూల్యాంకనం) కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రీవాల్యుయేషన్ ఫీజు ఒక్కో పేపర్‌కు రూ.500లు చెల్లించాలని, రూ.25లు చెల్లించి దరఖాస్తు ఫారం పొందాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ నెల 17వరకు దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కంట్రోలర్ సూచించారు.

ఉత్తమ గురువులకు సన్మానం



జిల్లా స్థాయి ఉత్తమ టీచర్లతో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, డీఈవో అశోక్, అడిషనల్ కలెక్టర్ అంకిత్, ఇతర ఉన్నతాధికారులు

- ఘనంగా గురుపూజోత్సవం
- విద్యలో జిల్లాను అగ్రభాగాన నిలపాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పిలుపు

నిజామాబాద్‌అర్బన్: గురుపూజోత్సవాన్ని విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించగా.. ముఖ్య అతిథులుగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ టీచర్లుగా ఎంపికైన 40 మందిని ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అంతకుముందు మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూపతి రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తికి మించిన వృత్తి సమాజంలో మరేదీ లేదని, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ జిల్లాను విద్యా రంగంలో అగ్రభాగాన నిలుపుదామని పిలుపునిచ్చారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని, గురువు స్థానానికి ఉన్న గౌరవాన్ని మరింత ఇనుమడింపజేయాలని హితవు పలికారు. అదనపు కలెక్టర్ అంకిత్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మోహన్‌రెడ్డి, కిషన్, వెనిగళ్ల సురేశ్, గద్దల రమేశ్, వెంకటేశ్వర్‌గౌడ్, జలంధర్, హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

దిద్దుబాటు



- నిజామాబాద్ కార్పొరేషన్‌లో రెవెన్యూ విభాగంపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో..
- అనుమతులు ఇచ్చిన.. పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల రీ వెరిఫికేషన్
- ఆరా తీస్తున్న కమిషనర్ దిలీప్‌కుమార్



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగంపై ఓ వైపు తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు ఇటీవలే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. కార్పొరేషన్‌లో పరిస్థితులపై కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేకాధికారి వినయ్‌కృష్ణారెడ్డితోపాటు వరంగల్‌లోని రీజినల్ డైరెక్టర్ కార్యాలయం ఆరా తీశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ నేరుగా రంగంలోకి దిగి దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

మ్యుటేషన్‌కు అక్షరాలా లక్ష..?

ఆస్తి ఒకరి పేరు మీద నుంచి మరొకరి పేరు మీదకు మార్చేందుకు(మ్యుటేషన్)కు రెవెన్యూ సిబ్బంది రూ.లక్ష డిమాండ్ చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు ఇదే పరిస్థితి ఉందని, పేర్లలో కరెక్షన్ చేయాలంటే రూ.30 వేలు డిమాండ్ చేస్తున్నారని అంటున్నారు. డబ్బులిచ్చినవారి పనులు మాత్రమే అవుతున్నాయని, డబ్బులివ్వని వారిని నెలల తరబడి తిప్పుకుంటున్నారని, గట్టిగా ప్రశ్నిస్తే మీ ఫైల్ కనపడటం లేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రముఖ న్యాయవాది కుటుంబానికి చేదు అనుభవం

గతేడాది డిసెంబర్‌లో మృతి చెందిన ప్రముఖ న్యాయవాది, మానవ హక్కుల నాయకుడు గొర్రెపాటి మాధవరావు కుటుంబానికి చేదు అనుభవం ఎదురైంది. ఎల్లమ్మగుట్టలోని ఇంటిని మాధవరావు పేరు పైనుంచి తన పేరుపైకి మార్చాలని ఆయన భార్య మీనా సహానీ 25న మార్చి 2025న దరఖాస్తు చేశారు. ఇప్పటివరకు వారికి మ్యుటేషన్ సర్టిఫికేట్ ఇవ్వకపోగా.. డబ్బులిస్తేనే మీ పని అవుతుందని నేరుగా చెప్పారు. దీంతో మీనా సహానీ మున్సిపల్‌కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు పని కాలేదు.

ఫైళ్లపై రిపోర్టు..

మ్యుటేషన్, అసెస్‌మెంట్, రీ అసెస్‌మెంట్, అలాట్‌మెంట్, నేమ్ చేంజెస్, ట్రేడ్ లైసెన్స్‌ల జారీ తదితర అనుమతులకు సంబంధించి ఫైళ్లన్నీ కమిషనర్ తెప్పించారు. రెవెన్యూ సెక్షన్ నుంచి ఈ సంవత్సరం జనవరి నుంచి ఇప్పటి వరకు అనుమతులు మంజూరు చేసిన ఫైళ్ల వివరాలు తెలుసుకున్నారు. మ్యుటేషన్‌కు సంబంధించిన ఫైళ్లను రీ వెరిఫికేషన్ చేయాలని అడిషనల్ కమిషనర్ రవీంద్రసాగర్‌కు సూచించారు. వాటితోపాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంచిన ఫైళ్లను కూడా తెప్పించి వాటిపై రిపోర్టు సిద్ధం చేయాలని రెవెన్యూ ఆఫీసర్ ఖయ్యూంను ఆదేశించారు.

ఆన్‌లైన్ పేమెంట్..

పని చేయాలంటే డబ్బులు డిమాండ్ చేస్తున్న పలువురు అధికారులు లంచం మొత్తాన్ని నేరుగా తమ అకౌంట్‌లోకి ఆన్‌లైన్ చేయించుకుంటున్నట్లు సమాచారం. ఇటీవల ఏసీబీకి చిక్కిన ఆర్‌ఐ శ్రీనివాస్ సైతం ఆర్మీ జవాన్‌ను ఫోన్ పే చేయమని కోరారు. ఏసీబీ దాడి తరువాత ఓ బాధితుడు నేరుగా ఏసీబీ అధికారిని కలిసి తాను ఆన్‌లైన్ ద్వారా రూ.17వేలు చెల్లించినట్లు ఫిర్యాదు చేశాడని తెలిసింది. మీ పని కావాలంటే తన కిందిస్థాయి అధికారిని కలిసి రావాలని రెవెన్యూ విభాగం ఉన్నతాధికారి ఒకరు సూచిన్నారనే ఆరోపణలున్నాయి. 20 ఏళ్లకుపైగా బల్దియా రెవెన్యూ విభాగాన్ని శాసించిన ఆర్‌ఐ దాసరి నరేందర్ శిష్యులు ఇప్పటికీ చక్రం తిప్పుతున్నారని, అన్ని స్థాయిల్లో వారున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. బల్దియాలోని రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ విభాగాల్లో ఫిర్యాదులు స్వీకరించేందుకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తే వందల సంఖ్యలో ఫిర్యాదులు అందుతాయంటున్నారు.

ప్రక్షాళన చేపట్టాం

బల్దియాలో ఇటీవల జరిగిన పరిణామాలు బాధాకరం. రెవెన్యూలో జరుగుతున్న అవకతవకలపై దృష్టి సారించాం. ఇప్పటివరకు అనుమతి ఇచ్చిన ఫైళ్లను తెప్పించాం. అని ఫైల్లను రీ వెరిఫికేషన్ చేయిస్తున్నా. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లపై వివరణ తీసుకుంటున్నా. తప్పుచేస్తే ఎంత పెద్ద అధికారి అయినా చర్యలు తప్పవు.

– దిలీప్‌కుమార్, బల్దియా కమిషనర్

కలెక్టర్ ప్రత్యేక సమీక్ష

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందితో జిల్లా కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి టి.వినయ్‌కృష్ణారెడ్డి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. మంగళవారం సాయంత్రం రెండుగంటల పాటు సమావేశమయ్యారు. ఇటీవలే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ అంశంపై వరంగల్‌లోని రీజనల్ డైరెక్టర్ (రెవెన్యూ) రిపోర్టు అడిగినట్లు తెలిసింది. దీంతో మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ టీంతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మ్యుటేషన్, అసెస్‌మెంట్, రీ అసెస్‌మెంట్, అలాట్‌మెంట్, పేరుమార్పులు, ట్రేడ్ లైసెన్సులపై నివేదిక తీసుకున్నారు. రెవెన్యూ విభాగం ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ రవి బాబు, రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. మ్యుటేషన్ల జారీ, పెండింగ్ పనులకు సంబంధించిన ఫైళ్లను తీసి చెక్ చేశారు. సర్కిళ్ల వారీగా పెండింగ్ రెవెన్యూ ఫైళ్లపై ఆరా తీశారు. సుదీర్ఘ కాలం నుంచి పలు మ్యుటేషన్ ఫైళ్లు పెండింగ్ లో ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వాటి విషయమై సంబంధిత జోన్ల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను ప్రశ్నించారు. సత్వరమే పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని, తద్వారా నగర పాలక సంస్థకు ఆదాయం కూడా సమకూరుతుందని కలెక్టర్ సూచించారు. పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. భవన నిర్మాణాలకు అనుమతులు, క్రమబద్ధీకరణ, ఎల్‌ఆర్‌ఎస్, ఇంజినీరింగ్ పనుల పురోగతిపై ఆరా తీశారు.



కార్పొరేషన్ రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

ఉప రాష్ట్రపతి ఎన్నిక.. ఓటేసిన ఎంపీ అర్వింద్



ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎంపీ ధర్మపురి అర్వింద్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. న్యూ ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో మంగళవారం పోలింగ్ నిర్వహించగా అర్వింద్ ఓటు వేశారు.

– సుభాష్‌నగర్

వర్చువల్‌గా జీజీహెచ్‌లో క్యాన్సర్ సెంటర్ ప్రారంభం



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డే కేర్ క్యాన్సర్ సెంటర్‌ను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. సెంటర్‌లో క్యాన్సర్ రోగులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు చికిత్స అందుతుందని, ఇప్పటివరకు హైదరాబాద్‌లోని ఎమ్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో మొదటి డోస్ చికిత్స పొందిన రోగులు రెండో డోస్ నుంచి డే కేర్ సెంటర్‌లోనే చికిత్స పొందవచ్చిన మంత్రి అన్నారు. అలాగే అవసరమైన సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్థో హెచ్‌వోడీ రాములు, డాక్టర్లు కిశోర్, చైతన్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారం కోసం.. సాష్టాంగ నమస్కారం

- న్యాయం చేయాలని సబ్ కలెక్టర్ ఆఫీస్ ఎదుట వినూత్న నిరసన

ఆర్మూర్‌టౌన్: తమ భూమిని కబ్జా చేసిన కొందరు 12 ఏళ్లుగా ఇబ్బందులు పెడుతున్నారని నీరడి సాయన్న అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట వినూత్న నిరసన తెలిపాడు.

ఆర్మూర్ మండలంలోని ఇస్సాపల్లికి చెందిన నీరడి సాయన్న మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని కుటుంబ సభ్యులతో కలిసి సాష్టాంగ నమస్కారం చేస్తూ తన సమస్యను వివరించాడు. అనంతరం న్యాయం చేయాలని కోరుతూ సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాకు వినతిపత్రం అందజేశారు. వివరాలు తెలుసుకున్న సబ్‌కలెక్టర్ న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సాష్టాంగ నమస్కారం చేస్తున్న నీరడి సాయన్న



సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాకు తమ సమస్యను వివరిస్తూ..

దక్కని ఆత్మీయ భరోసా

- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో బ్రేక్
- ఆ తరువాత ఊసెత్తని ప్రభుత్వం
- గణతంత్ర దినోత్సవాన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ప్రారంభం
- మండలానికి ఒక గ్రామంలో ఎంపిక చేసిన వారికి అందిన సాయం
- మిగతా లబ్ధిదారుల ఎదురు చూపులు



మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలం గాండ్లపేట్‌కు చెందిన ఎల్లయ్య అనే ఉపాధి హామీ కూలీకి ఇందరమ్మ భరోసా సాయం మంజూరైనట్లు అధికారులు పత్రాన్ని అందజేశారు. నాటి నుంచి ప్రభుత్వం ఇచ్చే సాయం కోసం ఎల్లయ్యతోపాటు జిల్లా వ్యాప్తంగా అనేక మంది కూలీలు నిరీక్షిస్తున్నారు. భూమి లేని కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతల్లో రూ.6వేల చొప్పున సాయం అందించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. పథకాన్ని ఈ ఏడాది జనవరి 26న (గణతంత్ర దినోత్సవం సందర్భంగా) ప్రారంభించింది. ఒక్కో మండలం నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అక్కడి ఉపాధి కూలీలకు సాయం అందించారు. ఆ తరువాత ఆత్మీయ భరోసా ఊసేలేకుండాపోయింది. అప్పట్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సాయం సొమ్ము జమ చేయడానికి బ్రేక్ పడింది. అయితే ఎన్నికల తంతు ముగిసి కోడ్ ఎత్తివేసినా సాయం సొమ్మును విడుదల చేసే విషయంలో ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు స్పందన లేదు. జిల్లా వ్యాప్తంగా 38,787 మంది ఉపాధి కూలీలకు ఇందరమ్మ భరోసా సాయం అందించేందుకు అధికారులు ఎంపిక పూర్తి చేశారు. 31 మండలాల్లోని 31 గ్రామాల్లో కేవలం 1,675 మందికి మాత్రమే సాయం సొమ్మును ఖాతాల్లో జమ చేశారు. మిగిలిన గ్రామాల్లోని 37,112 మంది కూలీలకు సాయం అందించాల్సి ఉన్నా ఇప్పటి వరకు నిధులను ప్రభుత్వం విడుదల చేయలేదు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలులోకి తీసుకువచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో సాయం అందించే విషయాన్ని ప్రభుత్వం మరిచిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సాయం అందిస్తే బాగుంటుంది



ప్రభుత్వం స్పందించి మిగతా కూలీలకు సాయం అందిస్తే బాగుంటుంది. నిధుల విడుదల కోసం ఎంతో మంది కూలీలు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఆలోచన చేసి నిధులను వెంటనే మంజూరు చేసి కూలీలకు చేయూతనందించాలి.

– ఒల్లపు ఎల్లవ్వ, ఉపాధిహామీ కూలీ, గాండ్లపేట్

ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది

ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. ఇతర జిల్లాల్లోను కూలీలకు సాయం సొమ్ము అందాల్సి ఉంది. ప్రభుత్వానికి అర్హుల జాబితాతోపాటు ఖాతా నంబర్లు పంపించాం. తొందరలోనే నిధులు జమ కావొచ్చు. – సాయాగౌడ్, పీడీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

అంతా ఒక్కటయ్యారు..!

- చేప పిల్లల పంపిణీ టెండర్లలో పాల్గొనని గుత్తేదార్లు
- పాత బకాయిలు ఇవ్వడం లేదని టెండర్లకు దూరం
- మరోసారి 12వ తేదీ వరకు గడువు పొడిగించిన ప్రభుత్వం
- మరింత ఆలస్యమవుతున్న చేపపిల్లల పంపిణీ
- అదును దాటిపోతోందని మత్స్యకారుల్లో ఆందోళన

డొంకేశ్వర్(ఆర్మూర్): ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ కోసం ప్రభుత్వానికి కాంట్రాక్టర్లు సహకరించడం లేదు. పాత బకాయిలు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లందరూ ఒక్కటై టెండర్లకు దూరంగా ఉన్నారు. మొదటగా ఆగస్టు 18నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు రాష్ట్ర శాఖ ఈ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లను ఆహ్వానించగా, ఒక గుత్తేదారు కూడా బిడ్ దాఖలు చేయలేదు. దీంతో టెండర్ల గడువు తేదీని ఈ నెల 8వ తేదీ వరకు పొడగించింది. రెండోసారి పొడిగించిన గడువు సైతం ముగియగా కాంట్రాక్టర్లు బిడ్‌లు వేయలేదు. ప్రభుత్వం మళ్లీ ఈనెల 12వ తేదీ వరకు గడువును పెంచింది.



మూడోసారైనా టెండర్లు దాఖలవుతాయో లేదో చూడాలి. గత రెండేళ్లలో చేప పిల్లలు సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు బకాయి బిల్లులు రావాల్సి ఉంది. వాటిని చెల్లించకుండా ప్రభుత్వం ఈ ఏడాది టెండర్లు చేపట్టడంపై కాంట్రాక్టర్లు అసంతృప్తితో ఉన్నారని తెలిసింది. ఈ పరిస్థితి నిజామాబాద్ జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. జిల్లాకు సంబంధించిన కాంట్రాక్టర్లకు పాత బకాయిలు రూ.4కోట్లకు పైగా రావాల్సి ఉంది.

లక్ష్యం.. 4.54 కోట్ల చేప పిల్లలు..

ఈ ఏడాది జిల్లాలోని 976 చెరువుల్లో 4.54కోట్ల చేప పిల్లలు వదలాలని మత్స్య శాఖ లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర శాఖకు ప్రతిపాదనలు పంపింది. ఇందులో 35 నుంచి 40ఎంఎం అలాగే 80 నుంచి 100 ఎంఎం చేప పిల్లలున్నాయి. వాస్తవానికి జూలైలో టెండర్లు పూర్తి చేసి ఆగస్టులో చేప పిల్లలను చెరువుల్లో వదలాలి. కానీ.. టెండరు ప్రక్రియను ప్రభుత్వం ఆలస్యం చేసింది. దీనికి తోడు కాంట్రాక్టర్లు టెండర్లు వేయకపోవడంతో మరింత ఆలస్యమవుతోంది. గడువు పొడిగించిన ప్రభుత్వం కొత్త గుత్తేదార్లను సముదాయించి టెండర్లు వేయించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పెంచిన గడవు తేదీ వరకు కూడా ఎవరూ టెండరు వేయకపోతే చేప పిల్లల పంపిణీ మరింత ఆలస్యమయ్యే అవకాశముంది. సెప్టెంబర్ నెలలోనే చెరువుల్లో చేప పిల్లలు వేయకపోతే అదును దాటి పోతుందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది 4.45 కోట్ల చేప పిల్లలను 967 చెరువుల్లో వదలాలని లక్ష్యం ఉండగా, ప్రభుత్వం 1.92కోట్ల చేప పిల్లలను 799 చెరువుల్లో మాత్రమే పోసేందుకు అనుమతి ఇచ్చింది. మరి ఈ ఏడాది పూర్తి లక్ష్యానికి అనుమతి ఇస్తుందో లేదో వేచి చూడాలి.

అదును దాటితే ఇబ్బందులు



గతేడాది కూడా చేప పిల్లలను ఆలస్యంగా చెరువుల్లో పోశారు. ఇప్పుడు కూడా అంతకు మించి ఆలస్యం చేస్తున్నారు. ప్రభుత్వం త్వరగా టెండర్లను పూర్తి చేసి చేప పిల్లలను పంపిణీ చేయాలి. ఇప్పటికే ఆలస్యం కాగా అదును దాటిపోతోంది. చెరువుల్లో లేటుగా పోస్తే చేప పిల్లల్లో సరైన ఎదుగుదల ఉండదు. – మోహన్, మత్స్యకారుడు, డొంకేశ్వర్

టెండర్లే ఆలస్యం

ఈ ఏడాది చేప పిల్లలను చెరువుల్లో వదిలేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి పెట్టుకున్నాం. టెండర్ల ప్రక్రియ పూర్తయితే ప్రభుత్వం మార్గదర్శకాలు ఇస్తుంది. వాటి ప్రకారం కాంట్రాక్టర్ల ద్వారా చేప పిల్లలను పంపిణీ చేస్తాం.

– ఆంజనేయస్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి

క్లుప్తంగా

ప్రమాదకరంగా విద్యుత్‌ వైర్లు



నందిపేట్‌(ఆర్మూర్‌): నందిపేట మండలం కౌల్‌పూర్‌ గ్రామంలో గృహాల మీదుగా ఏర్పాటు చేసిన విద్యుత్‌ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఇళ్ల సమీపంలో నుంచి వెళ్తున్న వైర్లు చేతికి అందే దగ్గరలో ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైర్లు కిందకు ఉండటంతో విద్యుత్‌ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు. సమస్యను విద్యుత్‌ అధికారులకు తెలిపినా పరిష్కారం కావడం లేదని, ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంటలకు డ్రోన్లతో మందుల పిచికారి



నవీపేట: నవీపేట శివారులోని పంట పొలంలో రైతు గోపాల్‌ ఆధునిక డ్రోన్ల సహాయంతో మంగళవారం క్రిమిసంహారక మందులను పిచికారి చేశారు. 20 ఎకరాల వరి పొలంలో తక్కువ ఖర్చుతో క్రిమిసంహారక మందులను పిచికారి చేశారు. ఎకరానికి రూ. 300 నుంచి రూ.350 వరకు ఖర్చు అయిందని రైతు తెలిపారు. కేవలం రెండున్నర గంటలలో 20 ఎకరాల వరి పొలంలో క్రిమిసంహారక మందులను డ్రోన్‌ ద్వారా స్ప్రే చేసినట్లు పేర్కొన్నారు. డ్రోన్ల వాడకంతో సమయం ఆదా అవడంతో పాటు ఖర్చులు తగ్గాయని అన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్‌ పోటీల్లో రన్నర్‌గా శ్రీ వైభవి



నిజామాబాద్‌నాగారం: ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన 11వ రాష్ట్ర సబ్‌ జూనియర్‌ బ్యాడ్మింటన్‌ చాపియన్‌ షిప్‌ పోటీల్లో నిజామాబాద్‌ జిల్లాకు చెందిన అనుముల శ్రీవైభవి సింగిల్స్‌ విభాగంలో రన్నర్‌గా నిలిచింది. ఈసందర్భంగా జిల్లా బాడ్మింటన్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కర్నాటి వాసు, సెక్రెటరీ కిరణ్‌ కుమార్‌, కోశాధికారి సాయరెడ్డిలు మంగళవారం ఆమెకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. శ్రీ వైభవి జూన్‌లో గోవాలో జరిగిన అండర్‌ 13 నేషనల్‌ ర్యాంకింగ్‌ టోర్నమెంట్‌, ఆగస్టులో ముంబాయి లో జరిగిన అండర్‌ 13 నేషనల్‌ ర్యాంకింగ్‌ టోర్నమెంట్‌లో కూడా ప్రతిభ కనబర్చి రెండు బంగారు పతకాలు సాధించి జిల్లాకి, రాష్ట్రానికి పన్నె తెచ్చిందన్నారు.

పాత రాజంపేటలో నిలిచిన అంత్యక్రియలు

- గ్రామంలో మృతిచెందిన సల్మాబేగం
- ఏళ్ల క్రితం ఇంట్లోంచి వెళ్లిన మృతురాలి కుమారుడు
- అంత్యక్రియలు చేయడానికి తిరిగిరాగా, ఒప్పుకోని స్థానికులు
- దత్తత కుమార్తె కరిష్మా బేగం చేయాలని నిర్ణయించిన గ్రామస్తులు

కామారెడ్డి రూరల్‌: తల్లిని కంటికి రెప్పలా కాపాడుకొని ఆసరాగా ఉండాల్సిన కుమారుడు 20 ఏళ్ల క్రితం ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. కుమారుడు వెళ్లిపోయాడని ఆ తల్లి కుంగిపోలేదు. కామారెడ్డిలో దొరికిన ఒక అమ్మాయిని పెంచుకుని పెళ్లి చేసి పంపించింది. మంగళవారం ఆ తల్లి మృతి చెందగా చెందగా 'తానే కొడుకునని అంత్యక్రియలు నేనే చేస్తాను. మా ఊరికి తీసుకెళ్తాను' అని వచ్చిన కొడుకును నువ్వెవరో తెలియదు అని వెల్లగొట్టారు. ఈ ఘటన కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పాత రాజంపేటలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సల్మాబేగంను 20 సంవత్సరాల క్రితం కుమారుడు వదిలి వెళ్లిపోయాడు. ఒక్కగానొక్క కొడుకు తనను వదిలి వెళ్లిపోవడంతో కొద్దిరోజులు బాధపడింది. తన రాత ఇంతే అనుకుని జీవిస్తుండగా కొద్దిరోజులకు కామారెడ్డి పట్టణంలో దొరికిన కరిష్మా బేగం అనే చిన్నారిని పెంచుకుంది. పెద్దయ్యాక సల్మాబేగం.. కరిష్మాకు పెళ్లి చేసి బాధ్యత తీర్చుకుంది. పెళ్లయినా పెంచిన తల్లి మంచి చెడులన్నీ కరిష్మానే చూసుకుంది. గ్రామంలో కూడా మంచి పేరు తెచ్చుకుంది. అయితే మంగళవారం సల్మాబేగం మృతి చెందింది. 20 ఏళ్లుగా అటువైపు రాని కొడుకు తల్లి చనిపోయిన విషయం తెలుసుకొని, అంత్యక్రియలు చేస్తానని తల్లి శవాన్ని తీసుకొని వెళ్లేందుకు గ్రామానికి వచ్చాడు. దాంతో కొడుకుతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. 20 ఏళ్ల తర్వాత తల్లి ఇప్పుడు గుర్తుకొచ్చిందా అంటూ నిలదీశారు. అయితే ఇన్నేళ్ల పాటు సల్మాబేగం మంచి చెడులు చూసిన కరిష్మాయే అంత్యక్రియలు చేయాలని నిర్ణయించారు. ఇన్నాళ్లుగా లేని ప్రేమ తల్లి చనిపోయాక రావడంతో ఆస్తి కోసమే వచ్చి ఉంటాడని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఈ విషయం పోలీసుల దాకా వెళ్లడంతో అంత్యక్రియలు నిలిచిపోయాయి.

విపత్కర పరిస్థితుల్లోనూ విధులు!

- ఉత్సవాలైనా, సహాయక చర్యలైనా ముందుంటున్న పోలీసులు
- రాత్రి, పగలు తేడాలేకుండా శాంతిభద్రతల రక్షణ కోసం కృషి



నగరంలో గణేశ్‌ ఉత్సవాల సందర్భంగా సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీపీ సాయిచైతన్య (ఫైల్‌)



నగరంలో వర్షంలోనూ విధులు నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్‌)

ఖలీల్‌వాడి: సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణే కాకుండా విపత్కర పరిస్థితుల్లోనూ పోలీసులు నిరాటంకంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలకు సేవ చేయడానికి, చట్టాన్ని అమలు చేయడానికి, నేరాలను నివారించడానికి, శాంతిభద్రతలను కాపాడటానికి పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. కానీ అత్యవసర పరిస్థితులు, పండుగలు, ప్రమాదలు, వరదలు వచినప్పుడు పగలు, రాత్రి తేడా లే కుండా విధులు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఒక వైపు వరదలు, మరో వైపు ఉత్సవాలు..

పండుగల వేళ అందరూ కుటుంబాలతో వేడుకలను వైభవంగా జరుపుకుంటారు. కానీ పోలీసులు మాత్రం పండుగలు, పర్వదినాల వేళ కుటుంబాలకు దూరంగా విధులు నిర్వహిస్తున్నారు. ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి, సమాజ శ్రేయస్సు కోసం డ్యూటీలు చేస్తున్నారు. ఇటీవల గణేష్‌ ఉత్సవాలకు ముందు జిల్లాలో భారీవర్షాలు కురవడంతో వరదలు సంభవించాయి. దీంతో అటు ఉత్సవాలు, ఇటు వరదలు ఒకేసారి వచ్చినా పోలీసులు తమ విధులను సమయస్ఫూర్తితో నిర్వహించారు.వరదల కారణంగా కొన్ని గ్రామాల్లోకి నీరు వచ్చి చేరడం, రోడ్లు ధ్వంసం కావడంతో జిల్లా అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాయి. వాగులు వంతెనల పైనుంచి ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈక్రమంలో రోడ్లపై నీరు వచ్చి చేరడంతో పోలీసులు వాహనాదారులకు హెచ్చరికలు జారీ చేస్తూనే, తగిన సహాయక చర్యలు చేపట్టారు. అలాగే గణేష్‌ నవరాత్రి ఉత్సవాల దృష్ట్యా ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. అన్ని వర్గాల ప్రజలకు, గణేష్‌ మండళ్లకు, శాంతికమిటీలకు సమావేశాలు నిర్వహించి ప్రశాంతంగా ఉత్సవాలు ముగించారు. సీపీ సాయిచైతన్య పకడ్బందీగా వ్యవహరించి, నవరాత్రుల్లో



రుద్రూర్‌ మండలంలో వానలో వరదలను పరిశీలిస్తూ..

వినాయక మండపాలు సందర్శించి, అక్కడ ఉన్న యువతకు మార్గనిర్దేశం చేశారు. గణేష్‌ ఉత్సవాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు, సూచనలు చేశారు. దీంతో ఉత్సవాలతోపాటు నిమజ్జనోత్సవ శోభాయాత్రలనూ విజయవంతంగా పూర్తి చేశారు.

ప్రత్యేక ప్రణాళికతో..

గతంలో వినాయక నిమజ్జనం సందర్భంగా పలు హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడంతో పోలీసులు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పోలీస్‌ ఫోర్స్‌తో గట్టి బందోబస్తు, నిఘాను ఏర్పాటు చేసి, ప్రత్యేక ప్రణాళికలను రూపొందించారు. ఉదయం, రాత్రివేళల్లో ప్రతీ గణేశ్‌ మండపం వద్దకు పోలీసులు గస్తీ తిరిగారు. నిజామాబాద్‌ పోలీస్‌కమిషనరేట్‌ పరిధిలోని ఆర్మూర్‌, బోధన్‌, నిజామాబాద్‌లో వినాయక ఉత్సవాలు ప్రారంభమైనప్పటినుంచి ముగింపు వరకు సీపీ పోతరాజు సాయిచైతన్య పర్యటించారు. ఒకవైపు వరదలు, మరో వైపు వినాయక ఉత్సవాల్లో వారంరోజుల నుంచి పోలీసులు కంటిమీద కునుకు లేకుండా, రోడ్లపైనే నిల్చుని సమర్థవంతంగా డ్యూటీలు చేశారు. నిజామాబాద్‌ కమిషనరేట్‌లో నిమజ్జన వేడుకల్లో పోలీసులు రెండురోజులు ఆన్‌డ్యూటీలోనే ఉండటంతో ప్రజలు పోలీస్‌లకు హాట్సాఫ్‌ అంటూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

అందరి సహకారంతో..



జిల్లాలోని అధికారులు, సిబ్బంది సహకారంతో సమిష్టిగా పని చేయడంతో గణేష్‌ ఉత్సవాలు విజయవంతంగా పూర్తిచేశాం. ఆలాగే భారీ వర్షాలకు ప్రజల వద్దకు వెళ్లి సహకారం అందించాం. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూశాం. నగరంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నిమజ్జనం సమయంలో ప్రత్యేకంగా పర్యవేక్షించాం. వరదలు, ఉత్సవాలకు ప్రతీ పోలీసు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పనిచేశారు.

– పోతరాజు సాయిచైతన్య, సీపీ, నిజామాబాద్‌

ఎస్సారెస్పీకి తగ్గిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 42వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. క్రితం రోజు సోమవారం సాయంత్రం పెరిగిన వరద మంగళవారం ఉదయం నుంచి క్రమంగా తగ్గింది. దీంతో ప్రాజెక్ట్‌ నుంచి గోదావరిలోకి నీటి విడుదలను ప్రాజెక్ట్‌ అధికారులు తగ్గించారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌ నుంచి గోదావరిలోకి 8 వరద గేట్ల ద్వారా 12500 క్యూసెక్కుల నీరు పోతుంది. వరద కాలువ ద్వారా 19 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 2500 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 800 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 200 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్‌ ద్వారా 270 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 684 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్‌ నిండుకుండలా ఉంది.



ఎల్‌వోసీ విధానంలో చెల్లింపులకు చర్యలు చేపట్టాలి

- మార్కెట్‌ కమిటీ చైర్మన్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి
- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి



మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముప్ప గంగారెడ్డి

సుభాష్‌నగర్‌: మార్కెట్‌ కమిటీ చైర్మన్‌, ఉద్యోగుల వేతనాలు, అలవెన్సులు, మార్కెట్‌యార్డు నిర్వహణ, ఇతరత్ర చెల్లింపులు ఈ–పోర్టల్‌లోని ఐఎఫ్‌ఎంఎస్‌ ద్వారా కాకుండా, ఎల్‌వోసీ విధానంలో చెల్లింపులు చేసేలా చర్యలు చేపట్టాలని మార్కెట్‌ కమిటీ చైర్మన్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి కోరారు. ఈమేరకు ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం ఆయన హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి, పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానంతో మార్కెట్‌యార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందని, కావున ట్రెజరీ ద్వారా నేరుగా చెల్లింపులు జరిపే విధంగా చూడాలని కోరారు. పాలకమండలి పదవీకాలాన్ని మూడేళ్లకు పొడగించాలని విజ్ఞప్తిచేశారు. మార్కెట్‌ యార్డుల్లో అవసరమైన పోస్టులను భర్తీ చేసుకునే అధికారం చైర్మన్లకు కల్పించాలని, చైర్మన్లకు ప్రొటోకాల్‌ వర్తింపజేయాలని, అలాగే పలు సమస్యలను విన్నవించారు. మంత్రి తుమ్మల సానుకూలంగా స్పందించారని అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి తెలిపారు. ప్రధానకార్యదర్శి నర్సింహాయాదవ్‌, గౌరవాధ్యక్షుడు చిలుక మధుసూదన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు, మార్కెట్‌ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనే ధ్యేయం

- జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ
- బెటాలియన్‌లో ఆరోగ్య శిబిరం



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ

డిచ్‌పల్లి: దేశంలో క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని నిజామాబాద్‌ జిల్లా వైద్యాధికారిణి (డీఎంహెచ్‌వో) రాజశ్రీ అన్నారు. డిచ్‌పల్లి మండలం టీజీఎస్పీ ఏడో బెటాలియన్‌లో మంగళవారం టీబీముక్త్‌ భారత్‌ అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధి నిర్ధారణ వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో ప్రారంభించి మాట్లాడారు. సీజనల్‌ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వారానికి మించి ఎవరైనా దగ్గు, జ్వరంతో బాధపడుతున్నట్లయితే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో పలువురికి క్షయవ్యాధి పరీక్షలు నిర్వహించారు. అలాగే బెటాలియన్‌లోని సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుటుంబసభ్యులకు జ్వర పరీక్షలు నిర్వహించారు. కమాండెంట్‌ సత్యనారాయణ, అసిస్టెంట్‌ కమాండెంట్‌ శరత్‌, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారిణి అవంతి, బెటాలియన్‌ యూనిట్‌ మెడికల్‌ ఆఫీసర్‌ అనుపమ, ఇందల్వాయి పీహెచ్‌సీ వైద్యాధికారి షారోన్‌ షైని క్రిస్టినా, జిల్లా టీబీ కోఆర్డినేటర్‌ రవి, ఆయుష్మాన్‌ ఆరోగ్యం మందిర్‌ డాక్టర్‌ అరుణ్‌, స్వప్న, సుచరిత, హెచ్‌ఈవో శంకర్‌, సూపర్‌వైజర్లు దేవపాలం, రాజేందర్‌, పద్మ, ఏఎన్‌ఎంలు అరుంధతి, సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు నిక్కచ్చిగా విధులు నిర్వహించాలి



బోధన్‌ రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న సీపీ సాయి చైతన్య

బోధన్‌రూరల్‌: పోలీస్‌ ఇమేజ్‌ పెంచేవిధంగా ప్రతీ సిబ్బంది నిక్కచ్చిగా విధులు నిర్వహించాలని నిజామాబాద్‌ సీపీ సాయి చైతన్య అన్నారు. బోధన్‌ రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ను మంగళవార సీపీ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్‌ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్‌ చేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలకు గేమింగ్‌ యాప్స్‌, సైబర్‌ మోసాలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో విలేజ్‌ పోలీస్‌ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై గ్రామాలలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అట్టి గ్రామాలలో ఉన్నటువంటి సమాచారం తమ పైస్థాయి అధికారులకు ఎల్లప్పుడూ చేరవేయాలన్నారు. అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ట్రాఫిక్‌ రూల్స్‌ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. బోధన్‌ ఏసీపీ శ్రీనివాస్‌, రూరల్‌ సీఐ విజయ్‌ బాబు, ఎస్‌హెచ్‌వో వెంకటనారాయణ, ట్రాఫిక్‌ సీఐ చందర్‌ రాథోడ్‌, ఏస్సైలు మచ్చేందర్‌, రమ, చంద్రమోహన్‌, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

బైక్‌ను ఢీకొన్న కారు: ఒకరికి గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని గాజులపేట్‌లోగల ఏఆర్‌ జిరాక్స్‌ వద్ద బైక్‌ను కారు ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని గాజులపేట్‌కు చెందిన ప్రేమ్‌కుమార్‌(45) మంగళవారం బైక్‌పై కంఠేశ్వర్‌కు బయలుదేరాడు. గాజులపేట్‌లోని ఏఆర్‌ జిరాక్స్‌ వద్ద ఓ కారు యూటర్న్‌ తీసుకుంటుండగా, బైక్‌పై వెళుతున్న ప్రేమ్‌కుమార్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జక్రాన్‌పల్లి మండలంలో ఇద్దరికి..

జక్రాన్‌పల్లి: మండల పరిధిలో బైక్‌ను కారు ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. అర్గుల్‌ గ్రామానికి చెందిన జైడి నర్సయ్య, అతని కోడలుతో కలిసి బైక్‌పై మంగళవారం ఆర్మూర్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో ఆర్మూర్‌ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌ పై ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు జక్రాన్‌పల్లి ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం...

- కాపాడిన పోలీసులు

ఆర్మూర్‌టౌన్‌: ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా.. పెర్కిట్‌ గ్రామానికి చెందిన సిరిగాల లక్ష్మీ ఆర్థిక, కుటుంబ సమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెందింది. దీంతో సోమవారం రాత్రి స్థానిక చెరువులో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కానీ స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు మహిళను చెరువులో దూకకుండా అడ్డుకొని కాపాడి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిండు ప్రాణాలు కాపాడిన ఆర్మూర్‌ ఎస్సీ కానిస్టేబుల్‌ విజయ్‌కుమార్‌, ఏఎస్సై రాందాస్‌ను స్థానికులు అభినందించారు.

హైవేపై అదుపుతప్పిన టిప్పర్‌



డిచ్‌పల్లి: మండలంలోని బీబీపూర్‌ తండా సమీపంలో గల 44వ నంబరు జాతీయ రహదారిపై కంకర లోడ్‌తో వెళుతున్న టిప్పర్‌ అదుపుతప్పి సైడ్‌వాల్‌ను ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. కంకర లోడ్‌తో టిప్పర్‌ మంగళవారం ఇందల్వాయి నుంచి నిజామాబాద్‌ బయలుదేరింది. బీబీపూర్‌ తండా సమీపంలో టిప్పర్‌ అతివేగంతో అదుపుతప్పి సైడ్‌వాల్‌ను ఢీకొట్టి నిలిచిపోయింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలు కాగా, టిప్పర్‌ ముందుభాగం దెబ్బతింది. స్థానికులు బాధితుడిని వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్‌ ఆస్పత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా



నందిపేట్‌ (ఆర్మూర్‌): మండలంలోని ఆంధ్రనగర్‌ గ్రామంలో డివైడర్‌ ఢీకొని కారు బోల్తా పడగా, అందులోని ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. నిజామాబాద్‌ నుంచి నందిపేట్‌ వైపు వస్తున్న కారు మంగళవారం ఆంధ్రనగర్‌ గ్రామంలో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు పల్టీలు కొడుతూ కొద్ది దూరం వెళ్లి బోల్తా పడింది. వెంటనే స్థానికులు కారు వద్దకు వెళ్లి అందులోని ముగ్గురు ప్రయాణికులను బయటకు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు డొంకేశ్వర్‌ గ్రామానికి చెందిన వారిగా సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నరసింహారెడ్డి (ఫైల్‌)



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఇందల్వాయి: మండల పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై సందీప్‌ తెలిపిన వివరాలు ఇలా.. అదిలాబాద్‌ జిల్లాలోని ఇచ్చోడకు చెందిన నరసింహారెడ్డి(21), విశాల్‌ అనే ఇద్దరు యువకులు హైదరా బాద్‌లో బీటెక్‌ చదువుతున్నారు. వారు మంగళవారం వేకువజామున కారులో హైదరాబాద్‌ నుంచి ఇచ్చోడకు బయలుదేరారు. ఇందల్వాయి మండలంలోని దేవితండా హైవే వద్ద వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరసింహారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, కారు నడుపుతున్న విశాల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు నిర్లక్ష్యంగా కారు నడిపిన విశాల్‌పై, లారీ పార్క్‌ చేసిన హర్యానాకు చెందిన లారీ డ్రైవర్‌ ఆలాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడు..

సిరికొండ: మండలంలోని కొండాపూర్‌ గ్రామ చెరువులో ఓ వృద్ధుడు పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. గోప్య తండాకు చెందిన బుక్యా శంకర్‌(59) అనే వృద్ధుడు సోమవారం చేపలు పట్టడానికి చెరువుకు వెళ్లాడు. రాత్రి అయిన అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చెరువు వద్దకు వెళ్లి చూడగా శంకర్‌ కనిపించలేదు. చెరువు కట్టపై అతడి బట్టలు ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గజ ఈతగాళ్ల సహాయంతో చెరువులో వెతకగా చెరువులో శంకర్‌ మృతదేహం లభ్యమైంది. మృతుడి కొడుకు సుమన్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో పలువురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: నగరంలో ట్రాఫిక్‌ పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీలు చేపట్టగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ 14మంది పట్టుబడినట్లు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ తెలిపారు. వారికి మంగళవారం నగరంలోని ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్‌ నిర్వహించిన అనంతరం జిల్లా కోర్టులో హాజరుపర్చారు. జడ్జి వారిలో 10 మందికి రూ.12వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగిలిన ముగ్గురికి రెండు రోజులు, ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

బిచ్కుంద(జుక్కల్‌): మండలంలో పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. పోలీసులు మంగళవారం అతడిని బిచ్కుంద జూనియర్‌ సివిల్‌ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. కోర్టుకు హాజరైన సదరు వ్యక్తి మద్యం తాగి వచ్చాడు. దీంతో జడ్జి అతడికి వారం రోజుల పాటు జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించినట్లు కోర్టు సూపరింటెండెంట్‌ అసదుల్లా తెలిపారు.

దోమకొండ: మండలంలో పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీలు చేపట్టగా మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. సదరు వ్యక్తిని పోలీసులు మంగళవారం కామారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి అతడికి ఒకరోజు జైలుశిక్షతోపాటు రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై స్రవంతి తెలిపారు.

చెక్‌ బౌన్స్‌ కేసులో ఒకరికి..

నిజామాబాద్‌ లీగల్‌: బ్యాంకు చెక్కు బౌన్స్‌ అయిన కేసులో ఓ వ్యక్తికి నిజామాబాద్‌ మొదటి అదనపు కోర్టు మేజిస్ట్రేట్‌ కుష్బు ఉపాధ్యాయ ఏడాది జైలు శిక్ష విధించారు. వివరాలు ఇలా.. నిజామాబాద్‌లోని అంబర్‌పేట్‌కు చెందిన ఆకుల నాగభూషణంకు తన స్నేహితుడు షేక్‌ అమస్‌ ద్వార గౌతంనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగి సయ్యద్‌ సాధిక్‌ షరీఫ్‌ పరిచయమయ్యాడు. ఈక్రమంలో షరీఫ్‌కు అవసరం నిమిత్తం 2020లో రూ.8,50,000వేలు అప్పుగా ఇచ్చాడు. డబ్బులు తీసుకునే సమయంలో గ్యారెంటీగా చెక్కు ఇచ్చాడు. తాను ఇవ్వాల్సిన డబ్బులకు షరీఫ్‌ 2021లో ఓ చెక్కును నాగభూషణంకు ఇచ్చాడు. అతడు చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్‌ అయ్యింది. దీంతో నాగభూషణం కోర్టులో కేసు వేయగా న్యాయమూర్తి విచారణ చేపట్టారు. అనంతరం నాగభూషణంకు ఇవ్వాల్సిన డబ్బులను నిందితుడు 9 అక్టోబర్‌, 2025 నుంచి ప్రతినెల రూ.1,06,250 చొప్పున చెల్లించాలని, అలా చెల్లించని పక్షంలో ఏడాది జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

ఖలీల్‌వాడి: నగరంలోని జండాగల్లీలోగల ఓ ఇంట్లో పేకాట స్థావరంపై దాడి చేసి, పేకాడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు నాలుగోటౌన్‌ ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడిచేసి, పేకాడుతున్న వారిని పట్టుకున్నామన్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 9,910 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలి

ఎల్లారెడ్డి: ఇటీవల భారీ వర్షాలకు ఇళ్లు కూలిన బాధితులు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్‌ కమిషనర్‌ మహేష్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా పాక్షికంగా కాని, పూర్తిగా కాని ఇళ్లు కూలినట్లయితే ఇంటి నిర్మాణం చేసుకోదల్చిన వారు ఇందిరమ్మ ఇళ్ల కోసం వార్డు ఆఫీసర్ల వద్ద దరఖాస్తులను బుధవారం లోగా అందించాలని అన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



ఇందల్వాయి: మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి క్రీడల్లో విజేతలుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్‌ రమేశ్‌ కుమార్‌ మంగళవారం తెలిపారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లా టీజీఈఎంఆర్‌ఎస్‌ మరిమడ్లలో నిర్వహించిన 5వ రాష్ట్రస్థాయి క్రీడల్లో పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు. అండర్‌–19 వాలీబాల్‌ విభాగంలో విద్యార్థినులు జి. కృష్ణవేణి, బి. పూజ, ఆర్‌. అఖిల, పి.సంగీత, ఆర్‌. వైష్ణవి, ఎ. వాణి ప్రథమ స్థానంలో నిలిచి విన్నర్‌ ట్రోఫీని అందుకున్నారని అన్నారు. ఈ బృందం జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. అలాగే ఖోఖో లో రన్నరప్‌గా విద్యార్థినులు ఎల్‌. సౌందర్య, సావిత్రి, సింధు, బిందు, అమూల్య, అక్షయ, సోనియా, సరస్వతి, అపూర్వ నిలిచారు. వీరిని హెచ్‌ఎం అభినందించి హర్షం వ్యక్తం చేశారు. బాక్సింగ్‌ అండర్‌ 19లో తేజశ్విని, హారిక, అండర్‌ 14లో షణ్ముఖప్రియ, జూడో అండర్‌ 19లో హారిక, తేజశ్విని, అండర్‌ 14లో ప్రసన్న, అర్చన, రెజ్లింగ్‌ అండర్‌ 19లో హారిక, శిరీష అండర్‌ 14లో మాధవి, వెయిట్‌ లిఫ్టింగ్‌ అండర్‌ 19లోసోని, హారిక, శిరీష, తేజశ్విని, తైక్వాండో అండర్‌ 14లో నిత్య, సౌందర్య, అండర్‌ 19లో రజిత, షార్ట్‌ పుట్‌ అండర్‌ 19లో కృష్ణవేణి, డిస్కస్‌ త్రో అండర్‌ 14లో బిందు, లాంగ్‌ జంప్‌ అండర్‌ 14లో శృతితోపాటు పలువురు రన్నింగ్‌ యోగా పోటోల్లో ప్రతిభ చాటారన్నారు. ఈ క్రీడల్లో విద్యార్థులు 9 బంగారు పతకాలు, 6 వెండి పతకాలు, 10 రజత పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. అనంతరం విజయాలను సాధించడంలో ముఖ్య పాత్ర పోషించిన పీఈటీ దివ్య, రోహిత్‌లను ప్రిన్సిపాల్‌ అభినందించారు.

యోగాసన పోటీల్లో జిల్లాకు పతకాలు



నిజామాబాద్‌నాగారం: నిర్మల్‌లో ఈనెల 5, 6, 7 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో నిజామాబాద్‌ జిల్లా క్రీడాకారులు పతకాల పంట తెచ్చారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు వివిధ విభాగాల్లో ప్రతిభ చాటి రెండు బంగారు, 7 రజత, 8 కాంస్య పతకాలు మొత్తం 17 పతకాలు సాధించి సత్తా చాటారు. రాష్ట్రస్థాయి విజేతలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనమ్‌ కృపాకర్‌, కార్యనిర్వాక కార్యదర్శి రామ్‌రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు యోగ రామచందర్‌, అధ్యక్షుడు ప్రభాకర్‌, ప్రధాన కార్యదర్శి బాలశేఖర్‌, కార్యనిర్వాహక కార్యదర్శి సంగీత, భూమాగౌడ్‌, రఘువీర్‌, జ్యోతి, ఉమారాణి తదితరులు క్రీడాకారులను అభినందించారు.

ముగిసిన బీఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్షా కేంద్రాల్లో బీఈడీ, ఎంఈడీ సెమిస్టర్‌ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిసినట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ 2, 4వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షల్లో మొత్తం 1145 మంది విద్యార్థులకు గానూ 1088 మంది హాజరైనట్లు తెలిపారు. ఎంఈడీ నాలుగవ సెమిస్టర్‌ రెగ్యులర్‌, 1, 2, 3, 4వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షల్లో మొత్తం ముగ్గురు విద్యార్థులకు ముగ్గురు హాజరైనట్లు ఆయన తెలిపారు.

జీపీవోలుగా 18 మంది వార్డు ఆఫీసర్లు

నిజామాబాద్‌ సిటీ: నగర మున్సిపల్‌ కార్పొరేషన్‌లో వార్డు ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తున్న 18 మంది సిబ్బంది జీపీవోలుగా ఎంపికయ్యారు. వీరంతా కలెక్టర్‌ను కలిసి ఇటీవల నియామక పత్రాలు పొందారు. దీంతో మంగళవారం 18 మంది వార్డు ఆఫీసర్లను మున్సిపల్‌ కమిషనర్‌ దిలీప్‌ కుమార్‌ రిలీవ్‌ చేశారు. వీరంతా గ్రామ పాలన అధికారులుగా విధులు నిర్వహించనున్నారు.